క్లుప్తంగా

ఘనంగా బండిశూల తిరునాల



గుత్తిఅనంతపురంలో ఊరేగింపు

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తి అనంతపురం, కాశేపల్లి, పామిడి మండలం రామరాజుపల్లి గ్రామాల సమక్షంలో జరుగుతున్న బండిశూల తిరునాల రెండో రోజు ఘనంగా నిర్వహించారు. విరుపాపురం, ఆవులాంపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల నుంచి రైతులు ఏడు జతల ఎద్దులను ఒక సరతగా చేసుకుని గ్రామాల్లో ఊరేగించారు. సాయంత్రం గుత్తి అనంతపురం సుంకులమ్మతల్లి దేవాలయం వద్ద నుంచి కాశేపల్లి మీదుగా రామరాజుపల్లి అమ్మవారి ఆలయం వరకూ సుర బండి లాగే కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు, ప్రజలు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

గ్రంథాలయం తనిఖీ

తాడిపత్రి టౌన్: పట్టణంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ ఓరియెంటేషన్ ప్రోగ్రాంను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాంబాబు, విశ్రాంత ఉపాధ్యాయులు వీరా రెడ్డి, వెంకటరమణప్ప, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్య ప్రసాద్ , గ్రంథాలయ అధికారి రవికుమార్‌నాయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి



మల్లికార్జున మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: అనారోగ్యంతో బాధపడుతూ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి చికిత్స పొందుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాలి మల్లికార్జున (65) మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గురువారం దోనిముక్కలరోడ్డులోని మల్లికార్జున నివాసానికి వెళ్లి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. వైవీఆర్‌తో పాటు కౌన్సిలర్ లింగన్న, నాయకులు నూర్ నిజామి, ఆర్‌డీజీ బాషా, దోనిముక్కల శీనా తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పామిడి: విజయవాడ దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు స్థానిక భోగేశ్వరాలయ, చెన్నకేశవ ఆలయం ధర్మకర్త మండలి ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ క్రిష్ణయ్య గురువారం తెలిపారు ఆసక్తి ఉన్న వారు 20 రోజుల్లోపు అనంతపురం దేవదాయశాఖ కార్యాలయానికి దరఖాస్తులు సమర్పించాలన్నారు. అదనపు సమాచారం కోసం 9441012561 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

తాడిపత్రిటౌన్: పట్టణంలో ఆపరేషన్ సిందూర్ విజయంపై విశ్వహిందూ పరిషత్ నాయకులు చేపట్టిన సంబరాలను అడ్డుకున్న తాడిపత్రి పట్టణ సీఐ సాయిప్రసాద్ తీరుపై గురువారం బీజేపీ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. సీఐపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని కోరుతూ ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరికి వినతిపత్రం అందజేశారు. విచారించి సీఐపై తగిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కార్యక్రమంలో బీజేపీ కర్నూల్ జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, జిల్లా నాయకుడు కొనుకొండ్ల రాజేష్, మాజీ అధ్యక్షుడు సంగిరెడ్డి శ్రీనివాసులు, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి హరీష్‌రెడ్డి, హరీష్‌బాబు, వెన్నపూస పల్లె గంగారాజేష్ , రాధాక్రిష్ణా, సింగిరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శైలజానాథ్

తాడిపత్రి రూరల్: మృత్యువాత పడ్డ చిన్నారుల తల్లిదండ్రులను గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శింగనమల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ శైలజానాథ్ పరామర్శించారు. యల్లనూరు మండలం కల్లూరులో నాగలక్ష్మి దుస్తులు ఉతికేందుకు హెచ్‌ఎల్‌సీ కాలువ వద్దకు వెళ్లి మనవడు, మనవరాలు జాషువా, లీడియోతోపాటు వృద్ధురాలు నాగలక్ష్మి నీట మునిగి మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న శైలజానాథ్ తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి వచ్చి మృతి చెందిన వారి వివరాలు, ప్రమాద సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటానన్నారు.

ఆ రోజులు మరిచిపోలేం

● వేసవి సెలవులు ఉత్సాహంగా గడిపేవాళ్లం ● అప్పటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్న ప్రముఖులు

సమ్మర్ స్పెషల్

వేసవి సెలవులను చిన్నారులు ఆటపాటలతో గడిపేందుకు ఆసక్తి చూపుతారు. ప్రస్తుతం పిల్లలు టీవీలు, సెల్‌ఫోన్‌లతో సమయాన్ని వృథా చేసుకోకుండా తమకు నచ్చిన క్రీడల్లో, సాంస్కృతిక అంశాల్లో నైపుణ్యతను సాధిస్తూ తమ మేథోశక్తికి పదును పెడుతున్నారు. అప్పట్లో విద్యార్థి దశలో వేసవి సెలవులు అనే గడిపారు' అనే అంశంపై ఉన్నత స్థానాల్లో స్థిర పడిన అధికారులు, ప్రముఖులు అమ అనుభవాలను సాక్షితో పంచుకున్నారు.



నిత్యం చిల్లా కట్టె, గోళీలు



గుత్తి: పాఠశాలల రోజుల్లో ఎంతో సరదాగా గడిపేవాడిని. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పాత కొత్తచెరువులో చదివాను. సేసవి సెలవుల్లో బావులకు వెళ్లి ఈత కొట్టేవాళ్లం. పాఠశాల ఉన్న సమయంలో పాఠశాల ముగిసిన వెంటనే గ్రౌండ్‌కు వెళ్లి చిల్లా కట్టె, గోళీల ఆట ఆడేవాళ్లం. వేసవి సెలవుల్లో అయితే ఎపుడూ మైదానంలోనే ఉండి ఆటలు ఆడేవాళ్లం. ఎండ, వాన అయినా లెక్క చేయకుండా ఆటలు ఆడేవాళ్లం. ఆటలు , సరదా తప్పా వేరే ధ్యాస ఉండేది కాదు. ఆ రోజులు ఎప్పటికీ మరిచిపోలేం.

–పుర్రా గోవిందరాజులు, సినీ లైన్ ఇన్‌స్పెక్టర్, గుత్తి

దొంగ, పోలీస్ ఆడేవాళ్లం



తాడిపత్రి రూరల్: స్వస్థలం కడప జిల్లా రైల్వే కోడూరు నియోజక వర్గంలోని ఓబుళవారిపల్లి మండలం వై. కోట గ్రామం. వేసవి సెలవులు వస్తే చాలు బావుల్లో ఈతకు స్నేహితులతో కలిసి వెళ్లేవాడిని. పౌర్ణమి వచ్చిందంటే చాలు వెన్నెల వెలుగులో స్నేహితులతో కలిసి రాత్రి 12గంటల వరకూ దొంగపోలీసు ఆడేవారం. గోళీలు, చిల్లాకట్టె, చెట్లు ఎక్కి కోతి కోమ్మచ్చి ఆడేవారం. అల్లరి భరించలేక కడప సమీపంలోని చిన్న మునలిరెడ్డిపల్లిలోని మేనత్త ఇంటికి పంపేవారు. అక్కడ పశువులను మేపడానికి వెళ్లేవాడిని. ఉదయం మేనమామతో కలిసి పాలు పోయడానికి కడపలోని పాల డైరీకి వెళ్లేవాడిని. మేనమామ తినుబండారాలను కొనిచ్చేవాడు.

– చంగల్‌రాయుడు, ఏడీఏ, తాడిపత్రి

రైలు ప్రయాణం ఇష్టం



తాడిపత్రి రూరల్: కణేకల్లు మండలంలోని తుంబిగనూరు అనే చిన్న గ్రామంలో పుట్టా. పదో తరగతి వరకూ అక్కడే చదివా. వేసవి సెలవుల కోసం వైఎస్సార్ జిల్లా యర్రగుంట్లలో ఉన్న అమ్మమ్మ ఇంటికి వెళ్లేవాడిని. గుంతకల్లుకు బస్సులో వచ్చి అక్కడి నుంచి రైలులో యర్రగుంట్లకు వెళ్లేవారం. అప్పట్లో రైలు అంటే మహా ఇష్టం. బస్సు కంటే రైలులో అమ్మమ్మ ఇంటికి వెళ్లాలని మంకు పట్టు పట్టేవాడిని. ఎలాగైనా సరే తల్లిదండ్రులను ఒప్పించి రైలులో వెళ్లేవాడిని. రైలు దిగిన వెంటనే అమ్మమ్మ ఇంటికి రిక్షాలో వెళ్లేవారం. అక్కడ స్నేహితులతో కలిసి గోళీలు, చిల్లాకట్టె, కబడ్డీ, కళ్లగంతల ఆటలు ఆడేవాడిని. మేము వచ్చామంటే అమ్మమ్మ పిండి వంటలు వండేది.

– డేవిడ్, మెడికల్ ఆఫీసర్, తాడిపత్రి

బంధువులతో గడిపేవాళ్లం



బుక్కరాయసముద్రం: మా సొంతూరు నంద్యాల. మా తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసమ్మలు ప్రకాశం జిల్లాలోని ఉయ్యాలవాడలో రూ.25 లక్షల సొంత నిధులు రూ.40 లక్షల చందాలతో అంకాలమ్మ గుడి కట్టించారు. మా బంధువులంతా కలసి ఏటా మే నెలలో ఉయ్యాలవాడలో అంకాలమ్మ జాతర చేసుకునేవాళ్లం. అయితే ఈ ఏడాది మా బంధువుల పెళ్లి ఉండడంతో జాతర చేయలేదు. ఆ మధుర క్షణాలు మరువలేం.

– రత్నకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ పశు సంవర్ధకశాఖ

ఇసుకలో అక్షరాలు దిద్దాం



యాడికి: మాది రాప్తాడు మండలంలోని లింగానపల్లి. మా గ్రామంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నాను. నేను చదువు కుంటున్న సమయంలో ఇప్పటి మాదిరి పలకలు, పుస్తకాలలో చదవలేదు. ఏమైనా రాయాలంటే ఇసుక, మట్టిలో రాసేవాళ్లం. వేసవి సెలవులు వచ్చినపుడు మా గ్రామ సమీపంలో ఉన్న బావులు, చెరువుల వద్దకు వెళ్లి ఈత నేర్చుకున్నాను. అలాగే క్రికెట్ ఆడేవాడిని.

–ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్, యాడికి

తాటి ముంజెలు తినేవాళ్లం



పుట్లూరు: నేను వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలం బసిరెడ్డిపల్లి వాసిని. వేసవి సెలవుల్లో అమ్మమ్మ, తాతయ్య ఊరికి వెళ్లేవాడిని. అక్కడ విరివిగా లభించే తాటి ముంజలను స్నేహితులతో కలిసి ఇష్టంగా తినేవాళ్లం. మద్యాహ్నం సమయంలో రామాలయం వద్ద వేప చెట్టు కింద కబుర్లు చెప్పుకోవడంతో పాటు ఆటలు ఆడుకునేవాళ్లం. మాకు పెద్దలు దగ్గర ఉండి బావుల్లో ఈత నేర్పేవారు రాత్రి సమయంలో రామాలయంలో పెద్దలు భజన చేస్తుంటే వారితో కలిసి భక్తి సంకీర్తనలను ఆలపించడం నేర్చుకున్నాను.

–ఓబుళరెడ్డి, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, పుట్లూరు

ఆధ్యాత్మిక ప్రవచాలు వినేవాడిని



గుంతకల్లుటౌన్: మా స్వస్థలం అనంతపురం. మా నాన్న ఏపీఎస్‌ఆర్‌టీసీలో ఉద్యోగిగా పనిచేసేవారు. ఉద్యోగరీత్యా మా నాన్న తాడిపత్రికి బదిలీ కావడంతో నేను 7వ తరగతి నుంచి ఇంటర్ వరకూ అక్కడే చదువుకున్నాను. వేసవి సెలవుల్లో ఎండలకు తిరగకుండా లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు చదివేవాడిని. ఆధ్యాత్మిక చింతన అధికంగా ఉండటంతో రమణ మహర్షి ఆశ్రమానికి వెళ్లి ఆధ్యాత్మిక ప్రవచనాలు వినేవాడిని. చిత్రలేఖనం, సాహిత్యమంటే చాలా మక్కువ. రేడియోలో వచ్చే మధురాంతకం రాజారామ్ కథలు వినేవాళ్లం. ఆయన ప్రేరణతో నేను కూడా 15 కథలు రాశాను. ఆకాశవాణిలో కూడా ఆ కథలు ప్రసారమయ్యాయి. వేసవి సెలవుల్లో చేసిన ఎంజాయ్‌మెంట్ మరచిపోలేని మధుర జ్ఞాపకాలు.

– మస్తాన్‌రావు, ఎంఈఓ, గుంతకల్లు

సరదాగా ఈత ..



గుత్తి: 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు గుత్తిలోని ఎంఎస్ హైస్కూల్లో చదువుకున్నాను. వేసవి సెలవుల్లో పాఠశాల దగ్గరలో ఉన్న చెరువులో , కుంట, బావుల్లో ఈత కొడుతూ ఎంతో సరదాగా గడిపేవాళ్లం. చిల్లా కట్టె ఆడేవాళ్లం. గోళీల ఆట కూడా ఆడేవాళ్లం. క్లాస్‌మేట్స్, స్నేహితులు కలిసి కొండ ఎక్కేవాళ్లం. కొండలో సీతాఫలాలు, రేగి పండ్లు, బలచ పండ్లు తినేవాళ్లం. ఎంతో సరదాగా, సంతోషంగా బాల్యం గడిచిపోయింది. ఆ రోజులు మళ్లీ తిరిగి రావాలని కోరుకుంటున్నాను.

–మర్తాడు దాదా ఖలందర్, సినిమా థియేటర్ మేనేజర్, గుత్తి

చిత్ర లేఖనంతో ఎంజాయ్



పామిడి: నాకు చిత్రలేఖనం, పుస్తక పఠనం అంటే మక్కువ. దీంతో సెలవులు వచ్చాయంటే బొమ్మలు వేస్తూ ఎంజాయ్ చేసేదాణ్ని. ఇప్పటికీ చిత్రలేఖనం, పుస్తక పఠనంతో సెలవులను ఎంజాయ్ చేస్తుంటాను. – కే తేజోత్స్న, ఎంపీడీఓ, పామిడి

సెలవుల కోసం వేచి చూసేవాళ్లం



గుత్తిరూరల్: నా చిన్నతనంలో వేసవి సెలవులు ఎప్పుడు వస్తాయా అని వేచి చూసేవాళ్లం. రోజూ చిల్లాకట్టె, గోలీలు ఆడేవారం, ఈతకు వెళ్లి చాలా సరదాగా గడిపేవాన్ని. పొలంలో మేనమాలమతో కలిసి దుక్కులు దున్నేవాన్ని. చెట్లకు ఊయలలు వేసుకుని ఊగేవాళ్లం. మళ్లీ ఆ రోజులు వస్తే బాగుండు. – ప్రభాకర్ నాయక్, ఎంపీడీఓ, గుత్తి

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

గుంతకల్లు రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సగానికి పైగా అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టడం, 13 మంది ఎంపీటీసీల్లో కేవలం ఏడు గురు ఎంపీటీసీలు మాత్రమే హాజరుకావడం, 25 పంచాయతీల నుంచి కనీసం ఒక్క సర్పంచ్ హాజరు కాకపోవడంతో ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాథుడే కరువయ్యాడు. దీంతో హాజరైన కొద్ది మంది అధికారులు ఉపాన్యాసంతో మొదలుపెట్టి సంబంధిత శాఖలో ప్రభుత్వం అమలు చేస్తున్న రెండు మూడు కార్యక్రమాలను చదివి వినిపించి సర్వసభ్యసమావేశాన్ని మమా అనిపించారు. హాజరైన ఎంపీటీసీల్లో ఒకరిద్దరూ సమస్యలపై అధికారులను ప్రశ్నించినా మౌనమే సమాధానం కావడంతో సర్వసభ్యసమావేశం కాస్తా ప్రజాప్రతినిధులకు అధికారులు చేపట్టే అవగాహన కార్యక్రమంగా మారిపోయింది. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ బీవీ మాధవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి జెడ్పీటీసీ కదిరప్ప, డిప్యూటీ తహసీల్దార్ నారాయణ స్వామి, మరికొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన అధికారులు, వారి సిబ్బంది ముఖ్యమంత్రి పర్యటన ఉందంటూ సమావేశానికి డుమ్మా కొట్టారు.



మాట్లాడుతున్న మండల ఇంజినీర్ ఓబులేసు. చిత్రంలో ఎంపీపీ మాధవి తదితరులు

యాంత్రీకరణ ద్వారా అధిక దిగుబడులు

బుక్కరాయసముద్రం: వ్యవసాయంలో యాంత్రీకరణ ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం విస్తరణా సంచాలకుడు డాక్టర్ శివ నారాయణ సూచించారు. గురువారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు కస్టం హైరింగ్ సెంటర్ విలువ ఆధారిత పదార్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణ ద్వారా పొలాల్లో కూలీల ఖర్చు తగ్గించుకోవడంతోపాటు పనులు త్వరగతిన పూర్తి చేసుకోవచ్చన్నారు. అనంతరం పాంత్రీయ పరిశోధనా స్థానం సంచాలకుడు డాక్టర్ జాన్సన్ షెడ్యూలు ఉప కులాల ప్రణాళిక పథకం గురించి వివరించారు. అనంతరం రైతులకు కస్టం హైరింగ్ సెంటర్ క్రింద స్ప్రేయర్లు, మొక్క జొన్న విత్తనం విత్తే పరికరాలు, కలుపు తీయు యంత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌రెడ్డి, పశు వైద్యం శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ చందన, కేవీకే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



యంత్ర పరికరాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు

గార్లదిన్నె: రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పొలాల్లో ఎరువులు వేసుకోవాలని అనంతపురం వ్యవసాయ డివిజన్ ఏడీ రవి సూచించారు. గురువారం మండల వ్యవసాయ కార్యాలయంలో మట్టి పరీక్షలు ఆధారంగా ఎరువుల యాజమాన్య పద్ధతులపై రైతులకు , వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి, ఏఓ సోమ శేఖర్, ఏఈఓ స్రవంతి, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం

తాడిపత్రి రూరల్: స్థానిక మునిసిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో గురువారం వైస్ చైర్మన్ షేక్షావలి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో పలు అంశాలపై ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశం ప్రారంభం కాగానే పహల్గాం మృతులకు సభ్యులు నివాళులర్పించి రెండు నిమిషాల మౌనం పాటించారు. ఉగ్ర స్థావరాలపై భారత్ చేపట్టిన దాడులపై హర్షం ప్రకటిస్తూ త్రివిధ దళాలకు జేజేలు పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో పట్టణంలోని సీపీఐ కాలనీ వద్ద గల ఎస్‌టీపీ-1లో మురుగు వెళ్లడానికి ఏర్పాటు చేసిన పైపులు దెబ్బతినడంతో వాటి స్థానంలో కొత్త వాటి కోసం రూ.12.35లక్షలు జనరల్ ఫండ్ నుంచి కేటాయించారు.15వ ఆర్థిక సంఘం నుంచి 2022కు రెండో విడత కింద టైడ్ గ్రాంట్ రూ.రూ.1.94 కోట్లు, అన్‌టైడ్ కింద రూ.1.29కోట్లు, ఇంట్రస్టు మొత్తం రూ.5.44 లక్షలను వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేయడానికి కౌన్సిల్ తీర్మానించింది. పట్టణంలోని నెహ్రూ పార్కులో అమృత్ పథకం కింద ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు ద్వారా 7,8 వార్డులు, పాతకోట, పోరాటకాలనీ, సుంకులమ్మపాలెం, గణేష్‌నగర్, సీపీఐ కాలనీ తదితర ప్రాంతాల్లోని 4వేల ఇళ్లకు నీటి సరఫరా చేసేందుకు పైపులైన్ల కోసం రూ.16.50 లక్షలు కేటాయించారు. అండర్ డ్రైనేజీ పనుల నిమిత్తం హర్యానాలోని గుర్‌గావ్ నుంచి యంత్ర పరికరాల కోసం రూ.85 లక్షలకు టెండర్లు పిలవగా తక్కువ టెండర్ వేసిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. మునిసిపాలిటీలో స్ట్రీట్ లైట్ల ఆటోమెటిక్ నియంత్రణ వ్యవస్థ కోసం రూ.10.84 లక్షలతో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తూ తీర్మానం చేశారు. పట్టణంలోని నందలపాడు. తహసీల్దార్ కార్యాలయం అశోక్ పిల్లర్, మునిసిపాలిటీ వరకూ మ్యూరల్ పెయింటింగ్ డెకరేటివ్ థీమ్‌తో సెంట్రల్ మీడియన్‌ల సుందరీకరణ కోసం రూ.7.27లక్షలను ఖర్చు చేయడానికి ఆమోదించారు. మునిసిపాలిటీ పరిధిలో రూ.19 లక్షలతో ఉత్సవాలు, , సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా వివరాలు, వాతావరణ హెచ్చరికలు తదితర వాటి కోసం అవుట్ డోర్ వాటర్ ప్రూఫ్ మల్టీకలర్ ఎల్‌ఈడీ డీస్‌ప్లే స్క్రీన్‌లను ఏర్పాటు చేయుటకు ఆమోదం తెలిపారు. అలాగే మరికొన్ని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు.



ఆపరేషన్ సిందూర్ విజయంపై జేజేలు పలుకుతున్న టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు

‘ఆపరేషన్ సిందూర్’ విజయంపై హర్షం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని అయాన్ థైక్వాండో క్రీడాకారులు ఉగ్రవాద ప్రతికార దాడిలో భారత్ విజయంపై గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు గ్రేట్ ఇండియా..గ్రేట్ ఆర్మీ అంటూ నినదించారు. కార్యక్రమంలో థైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పామిడి: కాశ్మీర్ పెహెల్గామ్ దాడికి ప్రతిదాడిగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర మెరుపుదాడిని స్వాగతిస్తూ గురువారం ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు షఫీ మాట్లాడారు. ప్రధాని మోదీ చేపట్టే ప్రతికార దాడులకు ముస్లింలు అండగా ఉంటామన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు

గుంతకల్లు: ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో పట్టణంలోనిశ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజాలు చేశారు. వాసవీ జయంత్యుత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం వాసవీ దేవీ విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కెనాల్‌ను వెడల్పు చేయండి

గుంతకల్లుటౌన్: హం-ద్రీనీవా కెనాల్‌కు 10 వేల క్యూసెక్కుల నీరు వచ్చేలా కాలువను వెడల్పు చేయాలని, రాగులపాడు లిఫ్ట్ నుంచి పిల్ల కాల్వల ద్వారా నియోజకవర్గంలోని రైతులకు సాగు, తాగు నీరు అందించి చెరువులు, కుంటలు నీటితో నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకులు సీఎం చంద్రబాబుకు రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. హంద్రీనీవా కాలువ కసాపురం నుంచి పాతకొత్తచెరువు వరకూ తవ్విన పిల్ల కాలువను వెడల్పు చేసి లైనింగ్ పనులు చేపట్టాలని కోరారు. సీపీఎం నాయకులు డి.శ్రీనివాసులు, వజ్రకరూరు కార్యదర్శి వీరుపాక్షి, నాయకులు నాగరాజు, షాషా, తిమ్మప్ప, తదితరలు పాల్గొన్నారు. అలాగే హంద్రీనీవా కెనాల్‌ను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖను ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ విడుదల చేశారు.

రాయలసీమకు ‘కూటమి’ ద్రోహం

గుంతకల్లు రూరల్: రాయలసీమకు తీరని ద్రోహం చేస్తున్న కూటమి సర్కార్.. లా యూనివర్శిటీని సైతం రాలయసీమ నుంచి తరలించేందుకు ప్రయత్నం చేస్తుందని వైఎస్సార్‌సీపీ ఐటీవింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మండలంలోని తిమ్మాపురంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ప్రాంతీయ అసమానతలు తలెత్తకుండా రాలయసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాకు సమాన అవకాశాలు కల్పించాన్నారు. ఈ మేరకు న్యాయ విభాగాలను కర్నూలులో ఏర్పాటు చేశారన్నారు. లా యూనివర్శిటీకి స్థలాన్ని కేటాయించి భవనాలు కూడా నిర్మించారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు అవరావతికి లా యూనివర్శిటీని తరలించేందుకు ప్రయత్నిస్తూ రాయలసీమకు ద్రోహం చేస్తున్నారన్నారు. రాయలసీమపై వివక్షను వీడకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన మహేంద్ర అనే యువకుడు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహేంద్ర గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో పలు చోట్ల చికిత్సలకు చేయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన అతడు గ్రామ సమీపంలోని పొలం వద్దకు వెళ్లి తన స్నేహితులకు ఫోన్ చేసి విషయం చెప్పి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని గమనించిన స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి కారు ఢీకొని చంద్రమోహన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు కరిడికొండ గ్రామానికి చెందిన చంద్రమోహన్ ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా అనంతపురం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అతడిని అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడులకు పాల్పడిన వారిపై కేసు నమోదు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లిలో దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన బొలికొండి, రమేష్‌కు పొలం రస్తా విషయంలో గొడవలు ఉండేవి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి మరో మారు ఘర్షణ జరిగి బొలికొండ, శివరంగడు, రంగడు, చంద్రకళపై రమేష్ వర్గం వారు రాళ్లు, కర్రలు దాడి చేశారు. దాడిలో బొలికొండకి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పలువురి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ బోల్తా.. యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ శివారులో గురువారం ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడి సతీష్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జొన్నగిరికి చెందిన సతీష్ పని నిమిత్తం గుత్తి వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది గాయపడిన అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడిపత్రి: తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఒకరు స్పృహ తప్పి పడిపోగా, చికిత్స కోసం రైల్వే పోలీసులు అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుర్తుతెలియని సుమారు 70 సంవత్సరాల వృద్ధుడు మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే జీఆర్పీ ఎస్ఐకి నాగప్పకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం, కారు ఢీ .. ఒకరికి గాయాలు

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తి అనంతపురం గ్రామం సమీపంలో గురువారం ద్విచక్ర వాహనం, కారు ఢీ కొన్న సంఘటన చోటు చేసుకొంది. ప్రమాదంలో ఆవులాంపల్లి గ్రామానికి చెందిన జయమ్మ అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.